క్లుప్తంగా

ఉత్సాహంగా ఆటల పోటీలు

హనుమంతునిపాడు: బాలల దినోత్సవాన్ని పురస్కరించుకొని స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆటల పోటీలు నిర్వహించారు. బాల బాలికలుఉత్సాహంగా పాల్గన్నారు. మంగళవారం కబడ్డీ, వాలీబాల్, ఖోఖో, బాల్ బాడ్మింటన్, క్రికెట్ తదితర పోటీలు నిర్వహించారు.

రాష్ట్రస్థాయి పోటీల్లో సత్తా



రాష్ట్రస్థాయిలో ప్రతిభ కనపర్చిన విద్యార్థులు

టంగుటూరు: రాష్ట్రస్థాయి స్కూల్ గేమ్స్ పోటీల్లో ఆలకూరపాడు జిల్లా పరిషత్ విద్యార్థులు ప్రతిభ చూపారు. వాలీబాల్ అండర్-14, 19 బాలికల విభాగంలో ఐదుగురు, టెన్నికాయిడ్ అండర్-14, 17, 19 విభాగంలో 12 మంది విద్యార్థులు పాల్గొని ప్రతిభ చూపారని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వాకా వెంకటేశ్వర్లు తెలిపారు. విజయనగరం జిల్లాలో వాలీబాల్ పోటీలు, ఏలూరుజిల్లా చింతలపూడిలో టెన్నికాయిట్ పోటీలు జరిగాయి.

చెల్లని చెక్కు కేసులో జైలుశిక్ష

కనిగిరి రూరల్: చెల్లని చెక్కు కేసులో విజయవాడకు చెందిన మహమ్మద్ అబ్దుల్ కరీంకు ఏడాది జైలు శిక్ష, రూ.5 లక్షల పరిహారం విధిస్తూ మంగళవారం కనిగిరి జ్యుడిషియల్ మెజిస్ట్రేట్ ఫస్ట్ క్లాస్ న్యాయమూర్తి కె.భరత్‌చంద్ర తీర్పునిచ్చారు. కోర్టు సిబ్బంది తెలిపిన వివరాల ప్రకారం విజయవాడకు చెందిన మహమ్మద్ అబ్దుల్ కరీం కనిగిరికి చెందిన మహ్మద్ రఫీ దగ్గర రూ.5లక్షలు అప్పుగా తీసుకుని దాని తాలూకు చెక్కును ఇచ్చాడు. సదరు రఫీ చెక్కును బ్యాంక్‌లో వేయగా, అది బౌన్స్ అయినది. దానికి సంబంధించిన కేసు 6 ఏళ్లు విచారణ సాగి మంగళవారం నిందితుడు మహమ్మద్ అబ్దుల్ కరీంకు ఏడాది జైలుశిక్ష, రూ.5 లక్షల పరిహారం విధిస్తూ తీర్పునిచ్చారు.

రాంబాబుకు ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు



సీఎం చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న రాంబాబు

సింగరాయకొండ: మండలంలోని పాతసింగరాయకొండ పంచాయతీ మల్లికార్జున నగర్ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయునిగా పనిచేస్తున్న అగ్రి బోయిన రాంబాబు రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుకు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా జాతీయ విద్యా దినోత్సవం సందర్భంగా విజయవాడలో జరిగిన కార్యక్రమంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, విద్యా శాఖ మంత్రి నారా లోకేష్ చేతుల మీదుగా అవార్డును అందుకున్నారు.

బడి వంటకు..ధరల మంట

- భారంగా మారిన మధ్యాహ్న భోజన పథకం
- మండుతున్న నిత్యావసరాలు, కూరగాయల ధరలు
- ఇప్పటికీ పాత మెనూ ధరలే అమలు
- విద్యార్థులకు సక్రమంగా అందని పౌష్టికాహారం



పాఠశాలలో భోజనం చేస్తున్న విద్యార్థులు

కనిగిరి రూరల్: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల హాజరు శాతం పెంచేందుకు అమలు చేస్తున్న మధ్యాహ్న భోజన పథకానికి నిత్యావసరాల ధరలు శరాఘాతంగా మారాయి. పెరుగులున్న ధరల కనుగుణంగా కూటమి ప్రభుత్వం బడ్జెట్ పెంచడం లేదు. దీంతో విద్యార్థులకు అందిస్తున్న భోజనంలో నాణ్యత ప్రమాణాలు తగ్గుతున్నాయి. దీనికి తోడు మధ్యాహ్న భోజన కార్మికులకు గౌరవ వేతనాలు, ఎండీఎంకు చెల్లించాల్సిన నగదు కూడా సుమారు రెండు మూడు నెలల నుంచి అందలేదు. దీంతో పూర్తి స్థాయిలో విద్యార్థులకు పౌష్టికాహారాన్ని అందించేందుకు అనేక అవస్థలు పడుతున్నారు. సామాన్య మధ్య తరగతి ప్రజలతో పాటు, ప్రభుత్వ పాఠశాల్లో చదివే పేద పేదవర్గాల పిల్లలకు కూడా నిత్యవసర వస్తువుల ధరల మంటలు తగులుతున్నాయి. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో విద్యారంగానికి అధిక ప్రాధాన్యత నిచ్చి.. మెరుగైన వసతులు, సౌకర్యాలు, నాడు. నేడు పథకంలో పాఠశాలల రూపు రేఖలు మార్చడంతో పాటు, మెరుగైన, నాణ్యమైన ఎండీఎం మెనుతో విద్యార్థులకు మంచి పౌష్టికాహారాన్ని అందించారు. దీంతో అప్పట్లో తల్లి దండ్రులు వారి పిల్లలను ప్రభుత్వ బడులకు పంపించేందుకు ఆసక్తి చూపే వారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక నిత్యవసర ధరలు, కూరగాయల ధరలు నింగినంటుతున్నాయి. దీంతో కుకింగ్ ఏజెన్సీలకు, వంట మనుషులకు ఎండీఎం పథకం నిర్వహణ భారంగా మారింది. బిల్లులు సక్రమంగా రాకపోవడంతో విద్యార్థులకు రుచికరమైన నాణ్యమైన భోజనం పాఠశాలల్లో అమలు జరగడం లేదనే విమర్శలు న్నాయి.

ఆ నగదు సరిపోక..

కుకింగ్ ఏజెన్సీలకు ప్రభుత్వం ఇచ్చే నగదు సరిపోక పోవడంతో వారి అవస్థలు వర్ణనాతీతంగా మారాయి. కనిగిరి నియోజకవర్గంలోని ఆరు మండలాల్లోని 458 ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో సుమారు 28,500 మంది విద్యార్థులు విద్యను అభ్యసిస్తున్నట్లు నివేదికలున్నాయి. ప్రాథమిక పాఠశాలల్లో చదివే విద్యార్థులకు రూ 5.88, ఉన్నత పాఠశాల విద్యార్థులకు రూ.8.57 నిర్వాహకులకు అందజేస్తున్నట్లు తెలిసింది. కనిగిరి మండలంలో ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలలు 110 వరకు ఉండగా, అందులో సుమారు 165 మంది వరకు కుకింగ్ ఏజెన్సీల నిర్వాహకులు ఉండగా.. నియోజకవర్గంలో 700 మందికి పైగా కుకింగ్ నిర్వాహకులు ఉన్నారు. ఎండీఎం మెనూలో పాత మెనూ ప్రకారం సోమవారం పొంగల్, లేదా చిక్కి, కూరగాయల పలావ్, గుడ్డుకూర, చిక్కి, మంగళవారం పులిహోర. టమోటా పచ్చడి, లేదా, దొండకాయ పచ్చడి, గుడ్డు, బుధవారం కూరగాయల అన్నం, బంగాళదుంప కుర్మా, గుడ్డు, చిక్కి, గురువారం సాంబార్ బాత్, ఉడికించిన గుడ్డు, శుక్రవారం అన్నం, ఆకు కూర పప్పు, గుడ్డు, చిక్కి, శనివారం ఆకుకూర అన్నం, పప్పుచారు. తీపి పొంగలి నిర్వాహకులు అందిస్తున్నారు. మెనూ ధరలు గత ప్రభుత్వం లోనివే.. ఈ ప్రభుత్వంలో ఇంకా ధరలు పెంచలేదు.

నియోజకవర్గంలోని ప్రభుత్వ పాఠశాలల వివరాలు:

మండలం	పాఠశాలల సంఖ్య
కనిగిరి	116
హెచ్ఎం పాడు	66
పీసీపల్లి	59
సీఎస్‌పురం	83
పామూరు	88
వెలిగండ్ల	66
మొత్తం	458

పెరిగిన ధరలకను గుణంగా నగదు చెల్లించాలి



కూటమి ప్రభుత్వం అధికారంలో వచ్చాక నిత్యవసర ధరలు, కూరగాయల ధరలు నింగినంటుతున్నాయి. పెరిగిన ధరలకనుగుణంగా పాఠశాలల్లోని కుకింగ్ ఏజెన్సీలకు విద్యార్థులకు చెల్లించే మెను చార్జీల ధరలు పెంచాలి. కుకింగ్ ఏజెన్సీల నిర్వాహకులు గౌరవ వేతనాలు పెంచి, కనీసం వేతనం అమలు చేయాలి. పాఠశాలల్లో చదివే పేద విద్యార్థులకు నాణ్యమైన మధ్యాహ్న భోజనం అమలుకు ప్రభుత్వం పెరిగిన ధరలకనుగుణంగా మెను ధరలు పెంచాల్సిన అవశ్యకత ఉంది. – **జీపీ రామారావు**, ఏఐటీయూసీ మండల కార్యదర్శి

ఎన్నికల నిర్వహణలో ఇంత నిర్లక్ష్యమా..?

- సాగునీటి సంఘాల ఎన్నికల నిర్వహణలో అధికారుల బాధ్యతారాహిత్యం
- ఆయకట్టు రైతులకు కనీస సమాచారం ఇవ్వరా..?
- ఆలస్యంగా ఓటరు జాబితా ప్రకటన

సింగరాయకొండ: 'సాగునీటి సంఘాల ఎన్నికలా... ఎప్పుడు జరుగుతాయి... మాకు తెలియదే' అని గ్రామాల్లో సాగునీటి ఎన్నికలకు సంబంధించి ఆయకట్టు రైతుల నుంచి వస్తున్న సమాధానం. గత నెల 22వ తేదీ ప్రభుత్వం సాగునీటి సంఘాల ఎన్నికల షెడ్యూల్‌ను విడుదల చేసింది. మండలంలో కలికవాయ, శానంపూడి, సోమరాజుపల్లి గ్రామాల్లోని మైనర్ ఇరిగేషన్ ట్యాంకులు పరిధిలో మూడు సాగునీటి సంఘాలకు, పాలేరు బిట్రగుంట స్కీమ్ సప్లయ్ ఛానల్ పరిధిలోని సోమరాజుపల్లి, పాకల, బింగినపల్లి గ్రామాల్లోని 8 మీడియం ఇరిగేషన్ చెరువుల పరిధిలో నాలుగు సాగునీటి సంఘాలకు ఎన్నికలు జరగాల్సి ఉంది. మీడియం ఇరిగేషన్ చెరువులకు సంబంధించి ఒక్కో సంఘానికి ఆరుగురు సభ్యులను, మీడియం ఇరిగేషన్ చెరువుకు సంబంధించి ఒక్కో సంఘానికి 12 సభ్యులను ఎన్నుకోవాల్సి ఉంది. ఈ ప్రకారం 66 మంది సభ్యులను ఎన్నుకోవాలి. ఓటర్ల జాబితాల ప్రకారం మొత్తం 954 మంది ఓటర్లు ఉన్నారు. ఈ సాగునీటి సంఘాల ఎన్నికలకు సంబంధించి ఈ నెల 10న ఓటరు జాబితాను అన్ని పంచాయతీల్లో పబ్లిష్ చేయాలి. 11, 12 తేదీలలో జాబితాలో సవరణకు అవకాశం ఉండగా 13వ తేది తుది ఓటర్ల జాబితాను ప్రకటించాలి. కానీ ఎన్నికలకు సంబంధించి అధికారుల నిర్లక్ష్యం కనిపిస్తోంది. వాస్తవానికి ఈనెల 11వ తేదీ మధ్యాహ్నం రెవెన్యూ కార్యాలయంలో ఓటర్ల జాబితాను పబ్లిష్ చేయగా కొన్ని గ్రామ పంచాయతీల్లో అదేరోజు సాయంత్రం, కొన్ని పంచాయతీల్లో 12వ తేదీ పబ్లిష్ చేశారు. గ్రామ పంచాయతీల్లో ఓటర్ల జాబితా పబ్లిష్ విషయం ప్రజాప్రతినిధులకు కూడా తెలియని పరిస్థితి. అంతేకాక ఓటర్ల జాబితా పబ్లిష్ విషయం గ్రామాల్లో దండోరా వేయాల్సి ఉంది. అంతేకాక పూర్తి వివరాలతో పత్రికా ప్రకటన ఇవ్వాల్సి ఉండగా అదీ జరగలేదు. ఈ ఓటర్ల జాబితాపై ఆయకట్టు రైతులు పెదవి విరుస్తున్నారు. ప్రాదేశికాల ప్రకారం ఓటర్ల జాబితాను ప్రకటించిన అధికారులు ఏఏ ప్రాదేశికాల కింద ఏ నంబర్ తూము పరిధిలోని ఆయకట్టు రైతులు ఉంటారనేది మాత్రం వివరణ ఇవ్వలేదని రైతులు ఆరోపిస్తున్నారు. తూముల నెంబర్ల ప్రకారం ఓటర్ల జాబితా ఇస్తే ఆయకట్టు రైతుల వివరాలు వెంటనే తెలిసే అవకాశం ఉందని, టీసీల ప్రకారం ఇవ్వడం వల్ల అంతా గజిబిజిగా ఉందని రైతులు ఆరోపిస్తున్నారు. ఎన్నికల నిబంధనలు పాటించకుండా కేవలం కొద్దిపాటి సమయం మాత్రమే ఇస్తే ఓటర్ల జాబితాను ఏవిధంగా పరిశీలించి సవరణలపై ఫిర్యాదులు చేస్తామని ఆయకట్టు రైతులు అధికారులను ప్రశ్నిస్తున్నారు. మరోప్రక్క ఓటర్ల జాబితా రెవిన్యూ అధికారుల పని అని మాకు సంబంధం లేదని ఇరిగేషన్ అధికారులు చెబుతున్నారని ఎన్నికల నిర్వహణలో వారికి మాత్రం బాధ్యతా లేదా అని రైతులు ఇరిగేషన్ అధికారుల పనితీరుపై విమర్శలు వ్యక్తం చేస్తున్నారు.

అధికారుల తీరు బాధ్యతారాహిత్యం:

అధికారులు ఎన్నికలు సజావుగా జరిగేందుకు ప్రయత్నించటం లేదని ఆరోపించారు. ఎన్నికల షెడ్యూల్ ప్రకారం సమయ పాలన పాటించడం లేదు. 10వ తేది ఓటర్ల జాబితా ప్రకటించాల్సి ఉంటే 11వ తేది జాబితా ప్రకటించారని ఆరోపించారు. గ్రామాల్లో ఎన్నికలపై దండోరా వేయలేదని, ఓటర్ల జాబితా సక్రమంగా లేదు. ఎన్నికలకు సంబంధించి అధికారులు ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారని, ఇలానే వ్యవహరిస్తే ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తాం.

– **డాక్టర్ ఆదిమూలపు సురేష్**, మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ అధ్యక్షుడు

వర్షం నీరు పోయేదెలా..?



సింగరాయకొండ మార్కెట్ సెంటర్‌లో రోడ్డుపై నిలిచిన వర్షం నీరు



నరశింహాశ్రేష్ఠి అడితి రోడ్డు సెంటర్‌లో నీరు నిలిచి పాదచారుల ఇబ్బందులు

సింగరాయకొండ: అల్పపీడన ప్రభావంతో మండలంలో మంగళవారం కురిసిన వర్షానికి రోడ్లు జలమయమయ్యాయి. 36.6 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైంది. మండల కేంద్రంలోని ప్రధాన రహదారిలో వర్షం నీరు రోడ్లపై నిలిచి రాకపోకలకు ఇబ్బందిగా మారింది. ఇటీవల కాలంలో ప్రధాన రహదారి గుంతల మయంగా మారటంతో ఆర్అండ్‌బీ అధికారులు తారు, కంకర మిశ్రమంతో గుంతలు పూడ్చారు. అయితే ఇష్టారాజ్యంగా గుంతలు పూడ్చటంతో వర్షం నీరు పోయే వీలులేక రోడ్లపై నిలిచింది. ఆర్టీసీ బస్టాండ్ సెంటర్, నరశింహాశ్రేష్ఠి అడితి రోడ్డు సెంటర్, మార్కెట్ సెంటర్, గ్రంథాలయం సెంటర్‌లో వర్షపు నీరు రోడ్డు పై నిలవటంతో వాహనదారులు వెళ్లేటప్పుడు నీరు చింది పాదచారులపై పడుతుండటంతో ఇబ్బందులు పడుతున్నారు. ఇటీవల కాలంలో వర్షం నీరు రోడ్డుపై నిలబడకుండా కాలువలోకి పోయేలా అధికారులు రోడ్డు మార్జిన్‌లో మట్టిని తొలగించారు. కానీ తరువాత ఏమైందో ఏమో గానీ మళ్లీ తొలగించిన ప్రాంతంలో మరల గ్రావెల్ తెప్పించి పోశారు. దీంతో వర్షం నీరు ఎటు పోయే వీల్లేక రోడ్డుపై నిలవటంతో తారు లేచిపోయి గుంతలు ఏర్పడే అవకాశం ఉందని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి వర్షం నీరు రోడ్డుపై నిలబడకుండా చర్యలు తీసుకుని తమ ఇబ్బందులు తీర్చాలని పాదచారులు కోరుతున్నారు.

బాధ్యతాయుతంగా విధులు నిర్వర్తించాలి



బొట్లగుడూరు సచివాలయ రికార్డులు తనిఖీచేస్తున్న ఎంపీడీఓ సురేష్

పామూరు: సచివాలయ సిబ్బంది బాధ్యతాయుతంగా విధులు నిర్వర్తించి సమస్యలు పరిష్కరించాలని ఎంపీడీఓ బొలినేని సురేష్ అన్నారు. మండలంలోని బొట్లగుడూరు సచివాలయం, అంగన్‌వాడీ కేంద్రం, ప్రాథమిక ఆరోగ్యకేంద్రం, జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలను మంగళవారం ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ సచివాలయ హాజరుపట్టీ, రికార్డులు పరిశీలించారు. పనుల కోసం వచ్చే వారిని పదే పదే కార్యాలయం చుట్టూ తిప్పుకోవద్దని, వెంటనే నిబంధనల మేరకు పనులు చేసి పంపాలన్నారు. పెండింగ్ అర్జీలపై అడిగి వివరాలు తెలుసుకున్నారు. అనంతరం ప్రాథమిక వైద్యశాలను సందర్శించి రోగులతో మాట్లాడి వైద్యసేవలు, వసతులపై చర్చించారు. సమస్యలపై డాక్టర హరిబాబుతో చర్చించారు. అనంతరం అంగన్‌వాడీ కేంద్రాన్ని తనిఖీ చేసి కేంద్రానికి వచ్చే పిల్లల హాజరుశాతం పెంచాలని, పౌష్టికాహారం సక్రమంగా ఇవ్వాలని సూచించారు. అనంతరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను సందర్శించి మధ్యాహ్న భోజనం నాణ్యతను పరిశీలించి హెచ్ఎం, ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు.

పీసీపల్లి: మండల పరిధిలోని పెద్ద వరిమడుగులో ఎంపీడీఓ ప్రభాకర్‌శర్మ, ఎంఈఓ సంజీవ్‌లను ప్రాథమిక పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. మధ్యాహ్న భోజనాన్ని స్వయంగా తిని పరిశీలించారు. మెనూ ప్రకారం భోజనం అందించాలని సూచించారు.

మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యం

సీఎస్‌పురం(పామూరు): అయ్యలూరివారిపల్లె పంచాయతీలో మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యం ఇచ్చినట్లు సర్పంచ్ ముత్యాల భారతీరెడ్డి, నాయకులు ముత్యాల నారాయణరెడ్డి తెలిపారు. అయ్యలూరివారిపల్లెలో మంగళవారం నూతనంగా వీధిలైట్లు ఏర్పాటు చేశారు. అదేవిధంగా పంచాయతీ పరిధిలో అంతర్గత సీసీరోడ్ల నిర్మాణం ప్రాధాన్యతా క్రమంలో చేపడుతున్నట్లు తెలిపారు. పంచాయతీలో మెరుగైన పారిశుధ్యం కోసం ప్రజలు సహకరించాలని, తడిచెత్త, పొడిచెత్త వేర్వేరుగా డస్టబిన్‌లలో వేయాలన్నారు. రోడ్లపై చెత్తా చెదారం వేయవద్దన్నారు. పంచాయతీలో బ్లీచింగ్, ఫాగింగ్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

ట్రావెల్ బస్సు ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతి

కనిగిరి రూరల్: ట్రావెల్ బస్సు ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడు. ఈ సంఘటన మండలంలోని నారపురెడ్డి పల్లి వద్ద మంగళవారం జరిగింది. పోలీసులు కథనం ప్రకారం రాయచోటి నుంచి విజయవాడ వెళ్తున్న ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు మండలంలోని నారపరెడ్డిపల్లి వీరబ్రహ్మం దేవాలయం వద్ద ఎన్ హెచ్ 565 రోడ్డు దాటుతున్న గుర్తు తెలియని పాదచారున్ని తెల్లవారుజామున వేగంగా వచ్చి ఢీకొట్టింది. ప్రమాదంలో తీవ్ర గాయాలు కావడంతో కనిగిరి ప్రభుత్వ వైద్యశాలకు తరలించగా.. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. ఎస్సై టి.శ్రీరాం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

దుస్తులు, చీరల పంపిణీ

కనిగిరి రూరల్: మండలంలోని ఎడవల్లి ప్రాదేశిక ఎంపీటీసీ వట్టివేళ్ల రంగమ్మ కుమారుడు, వైఎస్సార్ సీపీ నాయకుడు, దేవాంగ సంక్షేమ సంఘం రాష్ట్ర నాయకుడు వట్టివేళ్ల రంగబాబు మంగళవారం పలువురికి దుస్తులు, చీరలు పంపిణీ చేశారు. ఎడవల్లి, యర్రోబన పల్లి నాయకులు పాల్గొన్నారు.

క్రీడోత్సవాల సమ్మేళనంలో సత్తా

సీఎస్‌పురం(పామూరు): ఆచార్య ఎన్‌జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో తిరుపతిలో జరుగుతున్న అంతర కళాశాలల క్రీడోత్సవాల సమ్మేళనంలో మండలంలోని కదిరి బాబూరావు వ్యవసాయ కళాశాల విద్యార్థులు సత్తాచాటారు. తిరుపతిలోని వెంకటేశ్వర వ్యవసాయ కళాశాల వేదికగా మంగళవారం అంతర కళాశాలల క్రీడలు, సాహిత్యం, సాంస్కృతిక సమ్మేళనం వేడుకలు ఘనంగా ప్రారంభమయ్యాయి. కబడ్డీ, ఖోఖో, క్రికెట్ పోటీల్లో కేబీఆర్ విద్యార్థులు విశేష ప్రతిభ కనబరిచినట్లు కళాశాల పీడీ రవీంద్రబాబు, అసిస్టెంట్ ప్రొఫెసర్ సుస్మిత తెలిపారు.

సర్వే సక్రమంగా చేయాలి



అవగాహన కల్పిస్తున్న జిల్లా మలేరియా అధికారి

సింగరాయకొండ: మండలంలోని అన్ని గ్రామాల్లో జ్వరపీడితుల నుంచి రక్త నమూనాలు సేకరించాలని, ఫీవర్ సర్వేలో నిర్లక్ష్యం చేయవద్దని జిల్లా మలేరియా అధికారి జి.శ్రావణ్‌కుమార్ అన్నారు. స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని మంగళవారం శ్రావణ్‌కుమార్ ఆకస్మిక తనిఖీ చేసి ఆశా కార్యకర్తలతో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. డాక్టర్ శ్రావణ్‌కుమార్ మాట్లాడుతూ నీటి నిల్వలు లేకుండా జాగ్రత్తగా ఉండాలన్నారు. మలేరియా, టైఫాయిడ్, డెంగీ, చికెన్‌గున్యా జ్వరాలు ప్రబలకుండా చూడాలని సూచించారు. డాక్టర్ చైతన్యకృష్ణ, డాక్టర్ వంశీధర్, మలేరియా సబ్ యూనిట్ అధికారి సాగర్, ఆరోగ్య పర్యవేక్షకులు సయ్యద్ మసూద్‌అలీ, రాజమ్మ పాల్గొన్నారు.

జిల్లా మహాసభలను విజయవంతం చేయండి

కనిగిరి రూరల్: ఈనెల 19న పొదిలిలో జరిగే అఖిల భారత విద్యార్థి సమాఖ్య (ఏఐఎస్ఎఫ్) జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని ఆ సంఘ జిల్లా ఉపాధ్యక్షుడు సీహెచ్ పవన్ కళ్యాణ్ పిలుపునిచ్చారు. స్థానిక కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఆయన మంగళవారం మాట్లాడారు. ప్రభుత్వం విద్యా రంగ సమస్యలు పరిష్కరించడంలో విఫలం చెందిందన్నారు. సంఘ నాయకులు సయ్యద్ ఇఫ్రాజ్, ఎస్కే తాహీద్, తదితరులు పాల్గొన్నారు.

వరినారుమళ్లలో మెళకువలు పాటించాలి



రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏఓ సంపత్‌కుమార్

సీఎస్‌పురం(పామూరు): వరినారుమళ్లలో రైతులు మెళకువలు పాటించాలని వ్యవసాయాధికారి బి.సంపత్‌కుమార్ అన్నారు. మండలంలోని చెన్నపునాయునిపల్లి, గేణేశునిపల్లి గ్రామాల్లో మంగళవారం పొలంపిలుస్తోంది నిర్వహించారు. ఈసందర్భంగా ఏఓ సంపత్‌కుమార్ రైతులకు వరినారుమళ్లలో మెళకువలు, వరిసాగులో మెళకువలు వివరించారు. పంటల బీమా గురించి వివరించారు.పంటలు సాగుచేసిన రైతులు ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజనలో నమోదుకావాలని సూచించారు. ఏఈఓ పి.శ్రీనివాసులు, ఎంపీఈఓ ఎం వెంకటేశ్వరు పాల్గొన్నారు.

కనిగిరి రూరల్: రైతులు సస్యరక్షణ చర్యలు పాటించి అధిక దిగుబడులను పొందాలని వ్యవసాయధికారి పీ జోష్నా దేవి అన్నారు. మండలంలోని బొమ్మిరెడ్డిపల్లి, పునుగోడు, చల్లగిరిగిల్ల గ్రామాల్లో మంగళవారం పొలం పిలుస్తోంది నిర్వహించారు. ఉద్యాన అధికారి ఎం అంజలిభాయి మాట్లాడుతూ మినీ ట్రాక్టర్లు, తైవాన్‌స్ప్రేయర్లు అందుబాటులో ఉన్నాయని, అవసరమైన రైతులు ఉద్యాన శాఖ కార్యాలయాన్ని సంప్రదించాలన్నారు. రైతు సేవాకేంద్రాల సిబ్బంది, తాతపుడి రాజశేఖర్, వాసి భరత్, ఎస్కే నజ్మా, స్థానిక రైతులు పాల్గొన్నారు.

పామూరు: రైతులు వ్యవసాయాధికారుల సలహాలు, సూచనలు పాటించాలని ఏఓ కంచం రాధ అన్నారు. మండలంలోని దూబగుంట్ల, నుచ్చుపొద,తాతాయపల్లె, తిరగలదిన్నె గ్రామాల్లో పొలంపిలుస్తోంది నిర్వహించారు. తాతాయపల్లెలో కందిపైరును పరిశీలించి కందిని ఆశించిన తెగుళ్లపై, అరికట్టేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై రైతులకు వివరించారు. తిరగలదిన్నెలో రైతులకు వరిసాగులో మెళకువలు వివరించారు.

అంతర పంటలపై దృష్టి సారించాలి

పీసీపల్లి: రైతులు అంతర పంటల సాగుపై దృష్టి పెట్టాలని కనిగిరి ఏడీఏ వెంకటరమణ అన్నారు. మండల పరిధిలోని పెద చెర్లోపల్లిలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ఈ ఏడాది పొగాకుకు అధిక ధర వచ్చిందని ఎక్కువ మంది రైతులు ఆ పంట వైపు మొగ్గు చూపుతున్నారన్నారు. కానీ ఇతర రాష్ట్రాల్లో పొగాకు అధికంగా సాగు చేసి అమ్మకాలకు సిద్ధబయ్యారన్నారు. వచ్చే సీజన్‌కు మన రాష్ట్రంలో ధరలు స్థిరంగా ఉండే అవకాశాలు తక్కువని పొగాకు బోర్డు సూపరింటెండెంట్ కోటేశ్వరరావు తెలిపారు. వ్యవసాయాధికారి ప్రకాష్ పాల్గొన్నారు.

హనుమంతునిపాడు: పొగాకు రైతులు ప్రత్యామ్నాయ పంటగా అపరాలు సాగు చేయాలని కనిగిరి డివిజన్ సహాయ వ్యవసాయ సంచాలకుడు ఈవీ రమణ అన్నారు. మండలంలోని సీతారాంపురం, లింగంగుండ్ల గ్రామాల్లో రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. వ్యవసాయాధికారి రమణ కార్యదర్శి అశోక్, వీఏఏలు నవ్య, షేక్ మహబూబ్‌బాషా, శ్రీలక్ష్మీ, సాని కొమ్ము వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

18 మద్యం బాటిళ్లు స్వాధీనం

పీసీపల్లి: మండల పరిధిలోని నేరేడుపల్లి గ్రామానికి చెందిన షేక్ అల్లీ సాహెబ్ తరలిస్తున్న 18 మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై కోటయ్య తెలిపారు. పెద్ద చెర్లోపల్లి నుంచి మద్యం బాటిళ్లు తీసుకువెళుతుండగా పట్టుకొని అదుపులోనికి తీసుకొని కేసులు నమోదు చేసి బాటిళ్లను సీజ్ చేశామన్నారు. బెల్టుషాపులు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

భక్తిశ్రద్ధలతో చిలుకు ఏకాదశి వేడుకలు



పామూరు: కార్తీకమాసం చిలుకు ఏకాదశి వేడుకలను భక్తులు మంగళవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. చిలుకు ఏకాదశి శ్రీమహావిష్ణువుకు ప్రాముఖ్యమైనది కావడంతో భక్తులు వేకువజాము నుంచే వైష్ణవ ఆలయాలకు తరలివచ్చి ప్రత్యేక పూజలు చేశారు. సత్యనారాయణస్వామి ఆలయం, రుక్మిణీ సత్యభామా సమేత శ్రీమదన వేణుగోపాలస్వామి ఆలయంలో అర్చకులు సత్యబాబుస్వామి, జీవీఎస్ తేజలు ప్రత్యేకపూజలు నిర్వహించారు. అష్టాదశ శక్తిపీఠాల ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. తిరగలదిన్నె ఆలయంలో నీలకంఠేశ్వరునికి అభిషేకపూజలు నిర్వహించారు.

టంగుటూరులో మోస్తరు వర్షం



కొండపి ఫ్లై ఓవర్ కింద నిలిచిన వర్షం నీరు

టంగుటూరు: మండలంలో మంగళవారం ఉదయం నుంచి ఒక మోస్తారు వర్షం కురిసింది. మండలంలో 22 మి.మీ వర్షపాతంనమోదైంది. ఈ వర్షంతో గ్రామాల్లోని రహదారులు వర్షం నీటితో నిండిపోయాయి. గ్రామాల్లోని రోడ్లపైకి, ఇళ్లలోకి వర్షం నీరు చేరింది. టంగుటూరు సెంటర్ నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు ఆర్అండ్‌బీ రోడ్డు గుంతల మయమై వర్షం నీరు చేరడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. జాతీయ రహదారి అధికారుల నిర్లక్ష్యంతో కొండపి ఫ్లైఓవర్ బ్రిడ్జి కింద భారీగా వర్షం నీరు చేరాయి, దీంతో పాదచారులు, వాహనదారులు అవస్థలు పడ్డారు. ఈ వర్షం పొగనాట్లకు అనువైందని వ్యవసాయాధికారి తెలిపారు.